క్లుప్తంగా

రోగులకు బ్రెడ్డు పంపిణీ



ప్రసూతి విభాగంలో బ్రెడ్డు పంపిణీ చేస్తున్న సంస్థ సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎంసీహెచ్ బ్లాక్‌లోని ప్రసూతి విభాగంలో గర్భిణులు, బాలింతలకు ఆదివారం కమలాపురం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్రెడ్డు పంపిణీ చేశారు. ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ సభ్యులు సాయిప్రదీప్ మాట్లాడుతూ.. మానవసేవే మాధవసేవ అన్న గొప్ప సంకల్పంతో నిర్వహించిన ఈ కార్యక్రమం అభినందనీయమన్నారు. సంస్థ ప్రెసిడెంట్ సునీల్, డాక్టర్ జి.నాగేంద్ర, ఉమా మహేశ్వరప్ప, గణేష్, కమలాపురం పవన్, గుజరాతి వెంకటేష్ పాల్గొన్నారు.

తైక్వాండోలో రాణించాలి



క్రీడాకారులకు బెల్ట్‌లు, ప్రశంసా పత్రాలు అందజేస్తున్న కార్పొరేటర్ పద్మలతా రెడ్డి

కర్నూలు (టౌన్): మార్షల్ ఆర్ట్స్, తైక్వాండోలో చిన్నారులు రాణించాలని 17వ వార్డు కార్పొరేటర్ పద్మలతా రెడ్డి సూచించారు. స్థానిక పాత బస్టాండ్ కొండారెడ్డి బురుజు వద్ద చిన్నారులకు ఆదివారం తైక్వాండోలో బెల్ట్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన చిన్నారులకు బెల్టులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడల వైపు ప్రోత్సహించాలన్నారు. తైక్వాండో శిక్షకులు అజయ్, తైక్వాండో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి టి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆదిత్యునికి క్షీరాభిషేకం



ప్రత్యేక అలంకరణలో సూర్య భగవానుడు

కర్నూలు కల్చరల్: నగర శివారులోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. జ్యేష్ఠ మాసం మిధున సంక్రమణం సందర్భంగా సూర్య నారాయణ స్వామికి క్షీరాభిషేకం, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, అర్చనలు విశేషంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

కర్నూలు కల్చరల్: స్థానిక సోమిశెట్టి నగర్‌లోని రేషన్ షాప్ నుంచి ఆదివారం రాత్రి ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది దాడులు చేశారు. 160 కేజీల బియ్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

చదరంగంతో మెదడుకు పదును



చెస్ పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ శంకర్ శర్మ

కర్నూలు (టౌన్): మెదడుకు పదును పెట్టే క్రీడ చెస్ క్రీడ అని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఒలింపిక్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చెస్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఏకాగ్రతను పెంచే చెస్ క్రీడలో సాధన చేస్తే చదువులో మరింతగా రాణిస్తారన్నారు. కార్యక్రమంలో నాయక్, రేణుకా, చిన్నసుంకన్న తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యంలో సినారెది ప్రత్యేక శైలి

కర్నూలు కల్చరల్: తెలుగు సాహిత్య రచనలో సినారెది ప్రత్యేక శైలి అని వక్తలు అన్నారు. ఆదివారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో సినారె వర్ధంతితో పాటు సంగీత విభావరి నిర్వహించారు. సినారె చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ.. సినారె రాసిన తెలుగు సినిమా పాటలు విశేష ప్రజాధారణ పొందాయన్నారు. ఆయన విశ్వంభర రచనకు జ్ఞానపీఠ్ అవార్డు లభించిందన్నారు. పద్మశ్రీ, పద్మ విభూషణ్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వంటి ఎన్నో అవార్డులు పొందారన్నారు. సుమారు 3 వేలకు పైగా పాటలు రచించారన్నారు. కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, గాయకులు సుధారాణి, బాలవెంకటేశ్వర్లు, శ్రీనివాసులు సినారె రచించిన పాటలను పాడి అలరించారు. కళాక్షేత్రం ఉపాధ్యక్షుడు సీవీ రెడ్డి, ఇనాయతుల్లా, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రిజిస్ట్రార్ పోస్టు ఖాళీ!

- 9 నెలలుగా ఖాళీగా ఉన్నా పట్టించుకోని ప్రభుత్వం
- ఇన్‌చార్జ్‌లతో ముందుకు సాగని పాలన
- ఇబ్బందులు పడుతున్న క్రయవిక్రయదారులు



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే శాఖల్లో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఒక్కటి. అయితే ఈ శాఖను ముందుకు నడిపే ఉన్నతాధికారులను నియమించడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందింది. 9 నెలలుగా కర్నూలు జిల్లా రిజిస్ట్రార్ పోస్టు ఖాళీగా ఉంది. ఇన్‌చార్జ్‌లతో పాలన ముందుకు సాగకపోవడంతో క్రయవిక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఇన్‌చార్జ్‌లతో నెట్టుకొస్తున్న వైనం

2024 సెప్టెంబర్ 22వ తేదీ వరకు కర్నూలు జిల్లా రిజిస్ట్రార్‌గా నాగ మల్లిశ్వరరావు ఉండేవారు. అయితే ఆయన అప్పుడు ప్రభుత్వం జరిపిన సాధారణ బదిలీల్లో విశాఖపట్నం డీఆర్‌గా వెళ్లిపోయారు. దీంతో కొన్నాళ్లుగా జిల్లా రిజిస్ట్రార్‌గా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ కర్నూలు డీఐజీ కల్యాణి ఇన్‌చార్జ్ బాధ్యతలు నిర్వహించారు. తరువాత ఆమె ఆ బాధ్యతలు మార్కెట్ విలువల జిల్లా రిజిస్ట్రార్‌గా ఉన్న ఎం.చెన్నకేశవ రెడ్డికి అప్పగించారు. ఆయన కొన్నాళ్లు వినియోగదారులకు ఇబ్బంది లేకుండా నడిపారు. అయితే అతను ఏప్రిల్ నుంచి సెలవులో వెళ్లారు. జూలై 1వ తేదీ వరకు లాంగ్ లీవ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో మళ్లీ ఆ స్థానాన్ని అనంతపురం జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్‌కు అప్పగించారు. ఇలా దాదాపు 9 నెలలుగా జిల్లా రిజిస్ట్రార్ పోస్టు ఖాళీగా ఉండడంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

తొంగిచూడని ఇన్‌చార్జ్ డీఆర్

ప్రస్తుతం ఇన్‌చార్జ్ డీఆర్‌గా ఉన్న అనంతపురం జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ ఇటువైపు తొంగి చూడడం లేదు. దీంతో జిల్లా రిజిస్ట్రార్ చేయాల్సిన సొసైటీలు, ఫార్మ్‌లు, రిజిస్ట్రేషన్లలో తప్పులకు సంబంధించి ఎడిట్ అండ్ ఇండెక్స్‌లు, వివిధ అక్రమ రిజిస్ట్రేషన్ల వివాదాలు, కేసులను జిల్లా రిజిస్ట్రారే పరిష్కరించాల్సి ఉంది. అయితే ఆయన అనంతపురం నుంచి కర్నూలుకు రావడం చాలా అరుదు. ఫలితంగా ఆయా అంశాలకు సంబంధించిన వివిధ రకాల ఫైళ్లు పేరుకుపోతున్నాయి. వినియోగదారులు నిత్యం జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం వైపు వచ్చి వెళ్తున్నారు. కొందరు అక్కడే ఉండి పడిగాపులు కాస్తున్నా ఫలితం లేకుండా పోయింది. ఈ క్రమంలో ప్రస్తుతం జరుగుతున్న సాధారణ బదిలీల్లోనైనా కొత్త జిల్లా రిజిస్ట్రార్ వస్తాడనుకుంటే ఇప్పటి వరకు ఆ శాఖకు సంబంధించిన బదిలీల మార్గదర్శకాలు కూడా విడుదల కాలేదు. దీంతో క్రయ, విక్రయదారుల ఇబ్బందులు ఎప్పుడూ పరిష్కారం అవుతాయో తెలియడం లేదు.

ఆలయ కమిటీ రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేశాం

మేము గ్రామంలో శివాంజనేయస్వామి దేవాలయాన్ని నిర్మించాలని తలచాం. ఇందుకోసం దాతల నుంచి చందాలు తీసుకోవడానికి స్వామి వారి పేరిట ఆలయ కమిటీ రిజిస్ట్రేషన్ కోసం నెలన్నర క్రితం రూ.512 చలానా కట్టాం. కమిటీకి మూడు రోజుల్లో ఆమోదం లభిస్తుందని చెప్పారు. అయితే ఇంతవరకు జిల్లా రిజిస్ట్రార్ అందుబాటులో లేకపోవడంతో ఏమీ చేయలేక పోతున్నాం. రోజూ కార్యాలయానికి వచ్చి వెళ్లడం తప్పా పని జరగడం లేదు.

– ఈ.ఎల్లాగౌడ్, మునగాలపాడు, కర్నూలు రూరల్ మండలం

సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న విజయ రామాంజనేయులు

కర్నూలు(సెంట్రల్): భవన నిర్మాన కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు డి.అబ్దుల్‌దేశాయ్, మారెళ్ల విజయ రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో రెండో వార్డు సర్వసభ్య సమావేశం ఇస్మాయిల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవన నిర్మాణ కార్మికులకు సంబంధించి సెస్ డబ్బులు కార్మిక శాఖలో ఉన్నప్పటికీ వాటిని ఖర్చు చేయడంలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మికులకు సంక్షేమ పథకాలను వర్తింపజేస్తామని చెప్పి చేయడం లేదన్నారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వ తీరు ఏరు దాటకముందు ఓడ మల్లన్న.. ఏరు దాటాక బోడి మల్లన్న అన్నట్లు ఉందన్నారు. ఈ నెల 29వ తేదీన నిర్వహించే భవన నిర్మాణ కార్మికుల నగర కమిటీ మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎండీ షరీఫ్, ఎస్‌డీ కాజాపాషా పాల్గొన్నారు.

వాహన మిత్ర సాయం వెంటనే ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న కె.ప్రభాకర్

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబునాయుడు అధికారంలోకి వస్తే ఆటో కార్మికులకు వాహన మిత్ర కింద రూ.15 వేలు ఇస్తానని చెప్పి ఇప్పుడు నోరు మెదపడం లేదని ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ విమర్శించారు. ఆదివారం కల్లూరు మండలం ఆటో యూనియన్ సమావేశం కార్మిక, కర్షక భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ వాహన మిత్ర కింద ఏడాదికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించేవారన్నారు. అయితే తాను అధికారంలోకి వస్తే రూ.15 వేలు ఇస్తానని చెప్పిన చంద్రబాబునాయుడు తర్వాత ఏమీ మాట్లాడకుండా సంవత్సరం కాలం గడిపారని, వెంటనే సాయం అదించాలని కోరారు. లేదంటే ఆటో డ్రైవర్ల ఆగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. అలాగే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. మరోవైపు చలానాల పేరిట డ్రైవర్లను వేధించుకు తింటున్నారని, కాస్తోపుస్తో వచ్చిన ఆదాయం వాటికే సరిపోతుండడంతో కార్మికులు కుటుంబాలను పస్తులు ఉంచుకోవాల్సి వస్తోందన్నారు. అనంతరం కల్లూరు మండల ఆటో యూనియన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీరాములు, ప్రధాన కార్యదర్శిగా నాగార్జునుడు, కోశాధికారిగా మురళీ, కమిటీ ఉపాధ్యక్షులుగా ఈశ్వర్, అమర్‌నాథ్‌రెడ్డి, మధు, సూర్య, మల్లయ్య, నడిపి బిచ్చల్లి, మధు, కార్యదర్శులుగా మౌలాలి, ప్రతాప్, మధు, నాగన్న శాలుమియాలతోపాటు మరో 15 మందిని కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

గిరిజన లంబాడీలపై దాడులు అరికట్టాలి



మాట్లాడుతున్న కైలాస్‌నాయక్

కర్నూలు(అర్బన్): రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇటీవలి కాలంలో గిరిజన లంబాడీ ప్రజలు, ముఖ్యంగా మహిళలపై దాడులు అధికంగా జరుగుతున్నాయని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.కైలాస్‌నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక బంజారా కార్యాలయంలో రామాంజులునాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గిరిజన ఉద్యోగులపై కూడా అసత్య ప్రచారాలు, కుట్రలు జరుగుతున్నాయన్నారు. అగ్రకుల ఆధిపత్య కుట్రలో భాగంగానే గిరిజన లంబాడీలపై దాడులు జరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో సినీ జానపద గాయకురాలు మంగ్లీబాయిపై జరుగుతున్న దుష్ప్రచారాలను కూడా ఖండించడం జరిగిందన్నారు. ఆమెపై దుష్ప్రచారం చేసిన వారిని వెంటనే గుర్తించి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయాలన్నారు. నాయకులు నాగరాజునాయక్, రాముునాయక్, రాముడునాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించాలి



ప్రత్యేక అలంకరణలో జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులు



సందేశమిస్తున్న జయ గోవిందదాస్ ప్రభు

కర్నూలు కల్చరల్: విద్యార్థులు చిన్నతనం నుంచే నైతిక విలువలు పెంపొందించాల్సిన అవసరం ఉందని ఇస్కాన్ ప్రచారకులు జయ గోవిందదాస్ అన్నారు. ఆదివారం స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో భగవద్గీత శిక్షణా తరగతులు, ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆధ్యాత్మిక అంశాల గురించి అవగాహన కల్పించాలన్నారు. పురాణ ఇతిహాసాలు, రామాయణం, మహాభారతాల గురించి వివరించాలన్నారు. హరే రామ హరే కృష్ణ జప యజ్ఞం చేశారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు

కర్నూలు(హాస్పిటల్): సమస్యలపై పోరాటానికి ఐకమత్యంగా సిద్ధం కావాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ.నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సచివాలయంలో హెల్త్ అసిస్టెంట్లుగా పనిచేస్తూ ఎంపీహెచ్‌పీ (ఎఫ్) పదోన్నతి పొందిన వారు ఆదివారం ప్రాంతీయ శిక్షణా కేంద్రం(ఫిమేల్)లో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేశారు. యూనియన్ నాయకులు సంధ్యారాణి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు మాట్లాడుతూ.. అనేక పోరాటాల ఫలితంగా ఏఎన్‌ఎంలు పదోన్నతి పొందారన్నారు. ప్రభుత్వాలు ఉద్యోగుల పట్ల మొండి వైఖరి చూపున్నాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జులై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదానికి కృషి చేయాలని కోరారు. సీఐటీయు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు, సీఐటీయూ గ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ నిర్మల, సీఐటీయూ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం, నాయకులు మహేశ్వరి, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

హెల్త్ కమిటీల ఏర్పాటు

అభినందన కార్యక్రమం అనంతరం కర్నూలు, నంద్యాల జిల్లాల యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ కమిటీలను ఎన్నుకున్నారు. కర్నూలు అధ్యక్షులుగా బీఎస్ అరుణ, కార్యదర్శిగా జి.సంధ్యారాణి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మహేశ్వరమ్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి.పద్మ, కోశాధికారిగా ధర్మావతి, ఉపాధ్యక్షులుగా పుష్పలత, అహల్య, పుష్ప, చాముండి, ఉమాదేవి, వెంకటేశ్వరమ్మ, సహాయ కార్యదర్శులుగా వెంకటేశ్వరమ్మ, సంతోషమ్మ, విజయకుమారి, రామలక్ష్మి, విజయలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

‘కమిటీని రద్దు చేసే అధికారం లేదు’

కర్నూలు(సెంట్రల్): ఏపీ ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంసాని శ్రీనివాస్‌కు కర్నూలు జిల్లా కమిటీని రద్దు చేసే అధికారం లేదని, ఆయన నియమించిన అడ్‌హక్ కమిటీ చెల్లదని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తమ కమిటీ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక ద్వారా నియమకం అయ్యిందన్నారు. ఇంతలో కమిటీని రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం అన్యాయమన్నారు. ఎన్నిక ద్వారా వచ్చిన కమిటీలను రద్దు చేయొద్దని ప్రభుత్వం జీఓ ఇచ్చినా కూడా రద్దు చేయడం తగదన్నారు. అవినీతి, అక్రమాల్లో కూరుకుపోయిన సంసాని శ్రీనివాస్ స్థానంలో మరొకరిని ఎన్నుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో ఆయన తన పదవిని కాపాడుకోవడానికి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన కమిటీలను రద్దు చేసి నూతన కమిటీలో తనకు అనుకూలమైన వారిని పెట్టుకోవాలని చూస్తున్నారని, అది కానీ పని అన్నారు. త్వరలోనే ఆయన్ను అధ్యక్ష పదవి నుంచి దింపనున్నట్లు చెప్పారు.

క్రీడాపోటీలు ప్రారంభం



కరాటే పోటీలను ప్రారంభిస్తున్న ఒలింపిక్ అసోసియేషన్ నిర్వహణ కార్యదర్శి సునీల్‌కుమార్

కర్నూలు (టౌన్): క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరచి విజేతలుగా నిలవాలని ఒలింపిక్ సంఘం నిర్వహణ కార్యదర్శి సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్ పాఠశాలల క్రీడా పోటీల్లో భాగంగా కరాటే, సిలంబం పోటీలను నిర్వహించారు. పోటీలను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గత 15 సంవత్సరాలుగా ఒలింపిక్ అసోసియేషన్ క్రీడా పోటీలను నిర్వహిస్తుందన్నారు. నిరంతరం పోటీల్లో పాల్గొనడం వల్ల క్రీడాకారుల్లో నైపుణ్యం వెలుగులోకి వస్తుందన్నారు. నిర్వహణ కార్యదర్శి ఆరిఫ్ హుస్సేన్, మాస్టర్లు చంద్రశేఖర్, రమణ, రియాజుద్దీన్, షకీల్ అహమ్మద్, మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించవచ్చని సూచించారు. కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు ఆయన వివరించారు.

అర్జీల స్థితి తెలుసుకునేందుకు 1100 నంబర్

అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే అర్జీదారులు meekosam. ap.gov. in అనే వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవడానికి అవకాశం ఇచ్చినట్లు తెలిపారు.

నేడు నగరపాలకలో..

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. నగర పరిధిలోని ప్రజలకు ఆయా కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

15 లీటర్ల నాటుసారా స్వాధీనం

కర్నూలు (టౌన్): అక్రమంగా నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్, సబ్ ఇన్‌స్పెక్టర్ సిబ్బందితో కలిసి ఆదివారం కాల్వ గ్రామ శివారులో తనిఖీలు నిర్వహించారు. గుడుంబాయి తండాకు చెందిన టీ.నాగేంద్రనాయక్ అనే వ్యక్తి మోటార్ సైకిల్‌పై 15 లీటర్ల నాటుసారాను తరలిస్తుండగా అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. నిందిదుడిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కే.చంద్రహాస్ వెల్లడించారు. దాడుల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ నవీన్‌బాబు పాల్గొన్నారు.

ప్రసాద్ మృతి తీరని లోటు

కర్నూలు కల్చరల్: ఎస్టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు పి.ప్రసాద్ మృతి తీరని లోటని ఆయన ఆశయాలను కొనసాగిద్దామని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోకారి, జనార్దన్ పిలుపునిచ్చారు. ఆదివారం ఎస్టీయూ భవన్‌లో ఆయన సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉమ్మడి జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన పి.ప్రసాద్ మరణించడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పూర్వపు ప్రధాన కార్యదర్శి తిమ్మన్న, గౌరవాధ్యక్షులు రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థుల మృతికి నివాళి



క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య విద్యార్థులు

కర్నూలు(హాస్పిటల్): గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన ఘోర విమాన ప్రమాదంలో మరణించిన వైద్య విద్యార్థులకు కర్నూలు మెడికల్ కాలేజీలో ఘనంగా నివాళులర్పించారు. ఏపీ జూనియర్ డాక్టర్ల సంఘం ఆధ్వర్యంలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని క్యాజువాలిటీ నుంచి కర్నూలు మెడికల్ కాలేజీ వరకు క్యాండిళ్లతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సీబీ.సాహస్ మాట్లాడుతూ.. గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో చోటుచేసుకున్న విమాన ప్రమాదం అందరినీ తీవ్రంగా కలచివేసిందన్నారు. ఆ విమానం అక్కడి హాస్పిటల్ వసతి గృహంపై కూలి వైద్య విద్యార్థులు మరణించడం బాధాకరమన్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు. సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ వీఎం.హరి, డాక్టర్ హరుణ్ రషీద్, కుమార్ రాజా, అడ్వయిజరీ కమిటీ సభ్యులు డాక్టర్ అనంత్‌నాగ్, యూజీ విద్యార్థులు పాల్గొన్నారు.

మరువలేని మధుర స్మృతులు



గురువులతో పూర్వ విద్యార్థులు

కర్నూలు కల్చరల్: కర్నూలు అబ్బాస్ నగర్‌లోని ఆదర్శ విద్యా పీఠం పాఠశాల 1999 -2000 బ్యాచ్ తెలుగు మీడియం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. స్థానిక వీవీఎస్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొని చిన్ననాటి మధురానుభూతులను గుర్తు చేసుకొని ఉత్సాహంగా గడిపారు. కరెస్పాండెంట్ వావిలాల కృష్ణమూర్తి, ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు, గురువులు పులి రమణ, ఇనాయతుల్లా, లక్ష్మణ్ గౌడ్, వనజ, ఆని, పుణ్యావతి, లలిత, రవి, మంజుల, సుధాకర్, దౌలత్, శేషిరెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఆర్గనైజర్లు తలారి కృష్ణ నాయుడు, రాజశేఖర్‌రెడ్డి, ఉదయ్ కుమార్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, దుర్గారావు, ప్రమీలతో పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నీట్ ర్యాంకర్లకు సన్మానం



నరసింహను అభినందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షుడు, జిల్లా కమిటీ సభ్యుడిగా ఉన్న నరసింహా నీట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచారు. 602 మార్కులతో 4392వ ర్యాంకును సాధించారు. ఎలాంటి కోచింగ్ లేకుండా ఇంటి వద్దనే ఆన్‌లైన్ క్లాసులు వింటూ సన్నద్ధమై ఉత్తమ ర్యాంకు సాధించినట్లు ఆయన వెల్లడించారు. ఎస్ఎఫ్ఐ ‘చదువు..పోరాడు’ నినాదాన్ని నిజం చేయడంతో ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఆ సంఘం జిల్లా కార్యదర్శి అబ్దుల్లా, నగర అధ్యక్ష, కార్యదర్శులు అబుబకర్, సాయి ఉదయ్ అభినందనలు తెలిపారు.

నిత్యం పోరాటాలకు మద్దతు...

కర్నూలు నగరంలోని చాకలి శేషాద్రి, మద్దమ్మ దంపతుల కుమారుడు నరసింహ ఎస్ఎఫ్ఐలో ఉంటూ ఆ సంఘం పోరాటాలకు మద్దతుగా నిలిచేవారు. సంక్షేమ హాస్టళ్ల విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నరసింహ నేతృత్వంలో పోరాటాలు జరిగాయి. దీంతో ఆయన్ను నగర కమిటీ ఉపాధ్యక్షుడిగా, జిల్లా కమిటీ సభ్యుడిగా ఎంపిక చేశారు. ఎస్ఎఫ్ఐలో ఉండడం ద్వారా సమాజ పరిస్థితులను తెలుసుకోవడానికి అవకాశం ఉంటుందని, నిరంతరం ఎస్ఎఫ్ఐ నిర్వహించే విజ్ఞాన తరగతులు, ఆదివారం అధ్యయన తరగతులకు హాజరవ్వడం ద్వారానే నీట్‌లో మంచి ర్యాంకు సాధించినట్లు ఆయన చెప్పారు. మంచి వైద్యుడిగా స్థిరపడి పేదలకు ఉచిత వైద్యం అందించడమే తన ధ్యేయమని నరసింహ చెప్పారు.



ఇషాంత్‌ను సత్కరిస్తున్న స్విమ్మింగ్ అసోసియేషన్ సభ్యులు

కర్నూలు (టౌన్): నీట్‌లో ఆలిండియా స్థాయిలో 657వ ర్యాంకు, కేటగిరీ స్థాయిలో 414వ ర్యాంకు సాధించిన భవనాసి ఇషాంత్‌కు ఘన సత్కారం లభించింది. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీకి చెందిన ఈత కొలను వద్ద జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్విమ్మింగ్ కోచ్ నటరాజరావు, అసోసియేషన్ కార్యదర్శి రామక్రిష్ణ యాదవ్ మాట్లాడారు. ఇషాంత్ వైద్య విద్యలో ఉన్నతంగా రాణించి పేదలకు వైద్య సేవలు అందించాలన్నారు. ఉపాధ్యక్షుడు సర్వేశ్వర గౌడ్, కోశాధికారి దస్తగిరి, సంయుక్త కార్యదర్శి రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

మానవజాతికి ఆయుధం ‘మార్క్సిజం’



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు, కళాకారులు

కర్నూలు(సెంట్రల్): ఆర్థిక అసమానతలు, దోపిడీ ఉన్నంతకాలం మార్క్సిజం ఉంటుందని, మానవ జాతికి మార్క్సిజం ఆయుధమని ప్రముఖ కవి బి.ప్రసాదమూర్తి అన్నారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఉన్నం వెంకటేశ్వర్లు–ఉషా రాసిన సింధూరం పుస్తకావిష్కరణ సభ జరిగిది. సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి సభాధ్యక్షతన జరిగిన ఈ సభలో పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్ల్ మార్క్స్ రాసిన పెట్టుబడి పుస్తకాన్ని సింధూరం పేరుతో కవిత్వంగా మలచడం అరుదైన విషయమన్నారు. సభాధ్యక్షుడు మాట్లాడుతూ.. అసమానతలు, అంతరాలు లేని మరో ప్రపంచమే మార్క్సిజమని పేర్కొన్నారు. ప్రముఖ కవి వెంకట కృష్ణ, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ మాట్లాడారు. సాహితీ స్రవంతి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి, విరసం నాయకులు పానినాగేశ్వరాచారి, పులిచేరి మహేష్‌కుమార్, విజయులు మధు, నవీన్‌పాటి హేమంత్‌కుమార్, కవులు, రచయితలు, కళాకారులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం



సైక్లింగ్ ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎస్‌డీఓ భూపతిరావు

కర్నూలు (టౌన్): పర్యావరణ పరిరక్షణలో భాగంగా వారానికోరోజు సైక్లింగ్ చేద్దామని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, రేడియాలజిస్టు డాక్టర్ రవీంద్రా రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం నుంచి ఫిట్ ఇండియా సైక్లింగ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో గత 26 వారాలుగా పర్యావరణ పరిరక్షణ కోసం సైక్లింగ్ కార్యక్రమం నిర్వహించడం శుభపరిణామమన్నారు. దైనందిన జీవితంలో ప్రతి ఒక్కరూ ప్రతి రోజు సైక్లింగ్ చేసి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఇండియా కర్నూలు ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి డాక్టర్ రుద్రా రెడ్డి, హ్యాండ్‌బాల్ శిక్షకులు జతిన్, సైక్లింగ్ కో–ఆర్డినేటర్ కార్తికేషన్ తదితరులు పాల్గొన్నారు.